క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ సమావేశం

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహణ నిమిత్తం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. దీనికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. బాబు అండ్‌ కో ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. కూటమి మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే డెంగీ నివారణ



అనపర్తిలో డెంగీ నివారణ మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

అనపర్తి: పరిసరాల శుభ్రతతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ తాడి రామగుర్రెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలో డెంగ్యూ నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ది పీఎంపీ అసోసియేషన్‌ అనపర్తి, బిక్కవోలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నివాసాల చెంత నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, ఒంటిపై దద్దుర్లు వచ్చినా వెంటనే సమీపంలో పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యులు పద్మశ్రీ, తరుణ్‌, కోటేశ్వరి, ప్రవీణ్‌, నిర్మలాచారి, మండల కార్యదర్శి ద్వారంపూడి సాయిరామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్‌, షేక్‌ సిలార్‌ సాహెబ్‌ పాల్గొన్నారు.

గర్జిస్తున్న గ్రామసింహాలు



చంద్రేడు గ్రామంలో కుక్కల గుంపు

రంగంపేట: మండలంలో వీధి కుక్కల బెడద పెరిగింది. కుక్కలు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నా పెద్దా అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చంద్రేడు, పెదరాయవరం, మర్రిపూడి, వడిశలేరు తదితర గ్రామాల్లోని ప్రధాన ప్రాంతాల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ–1 సత్యనారాయణ

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని మండల విద్యాశాఖాధికారి–1 కె.సత్యనారాయణ అన్నారు. పెదపూడిలోని గాంధీ మెమోరియల్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు, నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక దాత నూని రాజ్‌చౌదరి విద్యార్థులకు క్రీడా దుస్తులు, యార్లగడ్డ గోవిందరాజుల చౌదరి విద్యార్థులకు నోటు పుస్తకాలు, క్రీడా మైదానం అభివృద్ధికి గ్రావెల్‌ సమకూర్చారు. ఈ సందర్భంగా కె.సత్యనారాయణ మాట్లాడుతూ దాతలు అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఈటీ బి.మురళీకుమార్‌, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు రేపు అంతరాయం

పెదపూడి: మండలంలోని గొల్లల మామిడాడ, సంపర గ్రామాల్లోని విద్యుత్‌ ఉపకేంద్రాల్లో ఆర్‌డీఎస్‌ఎస్‌, ట్రీ ట్రిమ్మింగ్‌ పనుల నిమిత్తం వచ్చే నెల 1న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా ఉండదని కాకినాడ విద్యుత్‌ శాఖ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ ఎస్‌.ఉదయభాస్కర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల గంగ్రేడు, రాజుపాలెం, పైన, వేండ్ర, పెద్దాడ, కుమారప్రియం, కైకవోలు, శహాపురం, సంపర, కాండ్రేగుల, చింతపల్లి, పుట్టకొండ, కరకుదురు గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రాజానగరం: పల్లకడియం 132/33 కేవీ ఎస్‌ఎస్‌లో నిర్వహణ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎస్‌ రాజమహేంద్రవరం రూరల్‌ ఇన్‌చార్జ్‌ జేఈఈ నటరాజన్‌ తెలిపారు. రాజానగరం, కానవరం, మల్లంపూడి, నందరాడ విద్యుత్‌ సబ్‌ స్టేషన్లకు పైసమయంలో సరఫరా ఉండదన్నారు.

చేరికల్లో తడబడి



బుచ్చెంపేటలో ముగ్గురు విద్యార్థులున్న పాఠశాల ఇదే..



ఈ షెడ్డులోనే కోటికేశవరం ఎంపీపీ స్కూల్‌ నిర్వహణ

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థులు
- కొరవడుతున్న సౌకర్యాలు

మధురపూడి: సర్కారు పాఠశాలల్లో సౌకర్యాలు మృగ్యమయ్యాయి.. ఎక్కడికక్కడే సమస్యలు వేధిస్తున్నాయి.. బడిబాటను దూరం చేస్తున్నాయి.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారిపోయాయి. దీంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుంది. రాజానగరం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి ఇది. కోరుకొండ మండలంలో 4, సీతానగరం మండలంలో 7 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో చేరికలు తగ్గిపోతున్నాయి. ఇలా చాలాచోట్ల ఉన్నాయి. కోరుకొండ మండలం బుచ్చెంపేట ప్రాథమిక పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి ఓ ఉపాధ్యాయురాలు పాఠాలు చెబుతున్నారు. గతంలో యూపీ స్కూల్‌గా ఉన్న దీనిని గుమ్ములూరులోని హైస్కూల్‌లో విలీనం చేశారు. ఈ పాఠశాలలో చదువుతున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులు గుమ్ములూరు హైస్కూల్‌కు వెళ్లారు. ఈ విలీనంతో ఇక్కడి 30 మంది విద్యార్థుల్లో 27 మంది విద్యార్థులు అక్కడికెళ్లారు. మిగిలిన ముగ్గురు బుచ్చెంపేటలోనే ప్రాథమిక విద్య అభ్యసిస్తున్నారు. కొత్తగా చేరికలు లేవు. అలాగే కోటికేశవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. రాఘవపురం పాఠశాలలో 9 మంది, కణుపూరులో 11 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి ఆసక్తి చూపడం లేదనడానికి ఇవే నిదర్శనం.

ఎక్కడ చూసినా ఇంతే..

చాలా ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కొన్ని పురాతన పాఠశాల భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కోరుకొండ మండలం కోటికేశవరం, రాఘవపురం, బుచ్చెంపేట, శ్రీరంగపట్నం, బొల్లెద్దుపాలెం తదితర ప్రాథమిక పాఠశాలల్లో మురుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. రక్షిత నీటి సమస్య వేధిస్తోంది. పాఠశాలలకు అనుసంధానంగా ఉన్న వసతి గృహ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటి పునర్నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదు. విద్యార్థినుల సౌకర్యార్థం టాయ్‌లెట్స్‌, బాత్‌రూమ్‌లు లేవు.

చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల కోసం ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా ఉపాధ్యాయులతో క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉన్నప్పటికీ పాఠశాలలు యథావిధంగా కొనసాగుతాయి. మెరుగైన విద్యకు కృషి చేస్తున్నాం.

– టి.కుశలవదొర, ఎంఈఓ, కోరుకొండ

కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలి



గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. కాగా కూటమి ప్రభుత్వం కనీస సదుపాయాలను కల్పించకుండా, సమస్యలకు నిలయాలుగా మార్చింది. దీంతో విద్యార్థుల చేరిక తగ్గుతోంది. చాలామంది ప్రైవేట్‌ పాఠశాలలకు వెళ్లిపోతున్నారు.

– పసుపులేటి బుల్లియ్యనాయుడు, కోరుకొండ

విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. రేపటి పౌరుల కోసం పాఠశాలల్లో సదుపాయాలను కల్పించాలి. గత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం దీనికి భిన్నమైన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా బడుల్లో సౌకర్యాలు కల్పించాలి.

– బుద్దిగ సత్తిబాబు, బూరుగుపూడి

మండల కన్వీనర్ల సేవలు భేష్‌

అనపర్తి: నిబద్ధతతో పని చేస్తూ అనుకున్న సమయానికి మండల కమిటీల కూర్పునకు కృషి చేసిన నాలుగు మండలాల కన్వీనర్లను నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం అనపర్తి వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీ లోపు గ్రామ కమిటీలు, వాటి అనుబంధ కమిటీల కూర్పు కూడా పూర్తి చేయాలని సూచించారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి దోహదపడుతున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు మండలాల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), గుత్తుల వెంకటరమణ, పోతుల ప్రసాదరెడ్డి (బుజ్జి), అనపర్తి, పందలపాక, తొస్సిపూడి గ్రామ కన్వీనర్లు నల్లమిల్లి మురళీ మోహన బాల కృష్ణారెడ్డి, సత్తి హరిప్రసాదరెడ్డి, నల్లమిల్లి త్రినాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్‌, కర్రి దాసు, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యులు లంక చంద్రన్న, రాష్ట్ర బూత్‌ లెవెల్‌ కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



సచివాలయ ఉద్యోగులను అభినందిస్తున్న సర్పంచ్‌ సత్యనారాయణ

పెదపూడి: ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయ ఉద్యోగులు నిరంతరం సేవలు అందించడం అభినందనీయమని కుమారప్రియం సర్పంచ్‌ బీవీవీ సత్యనారాయణ అన్నారు. కుమారప్రియం పంచాయతీలో ఇంతవరకూ వివిధ శాఖల్లో పనిచేసి ఇతర సచివాలయాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు, గ్రామ పెద్దలు బోడిశెట్టి ఫణీంద్ర, బీరద రామకృష్ణ, మాగాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పతనం తప్పదు



విలేకరులతో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్‌

అనపర్తి : ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల సామాజిక వర్గానికి ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు రాజకీయ పతనం తప్పదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌ఎస్‌ రత్నాకర్‌ అన్నారు. బుధవారం ఆయన అనపర్తి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిని తిప్పికొట్టేందుకు అంతా ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొప్పుల ప్రేమ్‌బాబు, బల్ల సత్యనారాయణ, నెల్లి సూరిబాబు, మద్ద మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్సులపై అవగాహన

సీటీఆర్‌ఐ: ఇంటర్‌ పూర్తయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోర్సులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్‌ తిరుపణ్యం తెలిపారు. కళాశాలలో ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ బీఎస్సీలో ఫిషరీస్‌, బయోటెక్నాలజీ, ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ లాంటి నూతన కోర్సులు వచ్చాయన్నారు. వీటిపై వివేకవర్ధని బ్లాక్‌లో శనివారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ అవగాహన కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌ నేర్పడానికి ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించామన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్‌ ఎన్నిక



మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘ కార్యవర్గ సభ్యులు వీరే..

పెదపూడి: మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్‌ నూతన అధ్యక్షుడిగా జి.మామిడాడ గ్రామానికి చెందిన సంకాబత్తుల కనక నాగేంద్రకుమార్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ జేఏసీ మెంబర్‌, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ చాంబర్‌లో బుధవారం ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గుర్తింపు పొందిన జిల్లా పంచాయతీరాజ్‌ ఉద్యోగుల కార్యవర్గానికి అనుసంధానంగా మండల కార్యదర్శుల అసోసియేషన్‌ ఎన్నిక నిర్వహించారన్నారు. ఇది అసోసియేషన్‌ గౌరవ అధ్యక్షుడు మన్యం శ్రీనివాసరావు చౌదరి ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా కనక నాగేంద్ర, కార్యదర్శిగా కె.తరుణ్‌ (ఏపీత్రయం), ఉపాధ్యక్షురాలుగా జి.ఉషారాణి (పెదపూడి), జాయింట్‌ సెక్రటరీగా దోమాడ జూనియర్‌ అసిస్టెంట్‌ వి.శ్రీనివాసమూర్తి, ట్రెజరర్‌గా గంగ్రేడు పంచాయతీ కార్యదర్శి తుమ్మల లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా రామేశ్వరం పంచాయతీ కార్యదర్శి బి.ప్రసన్నాంజనేయులు, జి.మామిడాడ–3 కార్యదర్శి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, శహపురం కార్యదర్శి బి.చంద్రకళ, పైన గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనక నాగేంద్ర మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నగదు, బియ్యం, కూరగాయలు అందజేస్తున్న బుల్లియ్యనాయుడు

కోరుకొండ: ఇటీవల స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం రోడ్డులో గ్యాస్‌ సిలిండర్‌ పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బాధిత నరసింహమూర్తి కుటుంబానికి పసుపులేటి బుల్లియ్యనాయుడు ఆధ్వర్యంలో బుధవారం నగదుతో పాటు, నిత్యావసరాలు అందజేశారు. బియ్యం ప్యాకెట్లు, కూరగాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ నాయకుడు బుల్లియ్యనాయుడు మాట్లాడుతూ తన వంతు సహకారంగా సరకులను అందించానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

కడియం: మద్యం మత్తులో ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో మాధవరాయుడుపాలెం గ్రామ చైతన్యనగర్‌కు చెందిన ముంజేటి సురేష్‌కు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు బుధవారం తీర్పు చెప్పారు. మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌కు చెందిన ముంజేటి సురేష్‌ 2024లో అదే గ్రామానికి చెందిన బొల్ల ధనుంజయ (డీజే)ను మద్యం మత్తులో డ్రింక్‌ సీసాతో దాడిచేసి గాయపరిచారు. ధనుంజయ ఫిర్యాదు మేరకు అప్పటి సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ టి.కృష్ణసాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్‌షీట్‌ ఫైల్‌ చేశారు. కడియం ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచగా అడిషనల్‌ పీపీ రాధాకృష్ణంరాజు కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. సురేష్‌ నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష పడింది.

సేంద్రియ సాగు... బహు బాగు

- కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు
- ఇంట్లోనే తయారు చేస్తున్న మహిళలు
- కూరగాయల పెంపకానికి ప్రాధాన్యం



దాబాపై పెంచిన మొక్కలు

సీటీఆర్‌ఐ: సాగులో విచ్చలవిడిగా ఎరువుల వాడకం.. ఇష్టానుసారంగా పురుగు మందుల వినియోగంతో ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న కూరగాయలు అనారోగ్య కారకాలుగా మారుతున్నాయి. నాణ్యమైన కూరగాయలు దొరకడం చాలా కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో చాలా మంది తమ ఇళ్లు, పెరట్లో, డాబాలపై కూరగాయల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని చాలా శ్రద్ధగా పెంచుతున్నారు. అయితే ఆ మొక్కలకు ఎరువులు వేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయల వ్యర్థాలతో మంచి ఎరువు తయారు చేసేలా శిక్షణ ఇస్తోంది. దీనివల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకోవచ్చు. నగర పరిధిలోని సుమారు 5 వేల కుటుంబాలను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చారు. ఇంకా మరికొంత మందికి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఐదు వేల కుటుంబాల వారు సేంద్రియ ఎరువును తయారు చేసుకుని వాటిని వారి సొంతానికి వాడుకుంటున్నారు. నగరంలో చాలామంది మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డెనింగ్‌ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని సొంతానికి వినియోగించగా, మిగిలినవి ఇతరులకు అమ్ముతున్నారు.

ఆసక్తి చూపుతూ..

ప్రతి ఒక్కరూ ఇప్పుడు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంట్లో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ మొక్కలు నాటుతున్నారు. ఇంటి పెరట్లో, డాబాపై పూల మొక్కలు, కూరగాయలు వంటివి సొంతంగా పండిస్తున్నారు. మహిళలు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయిస్తున్నారు.




సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

తయారీ విధానం

కూరగాయ మొక్కలు పండించడానికి సేంద్రియ ఎరువులు అవసరమవుతాయి. వీటిని కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని కోసం కార్పొరేషన్‌ చర్యలు తీసుకుంది. ఇంట్లో వ్యర్థ పదార్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకునే విధంగా మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుంది. శిక్షణ పొందిన మహిళలు ఇంట్లోనే హోం కంపోస్టును తయారు చేసుకుంటున్నారు. వీటిని సొంతానికి వాడుకోగా, మిగిలిన వాటిని నర్సరీలు, కూరగాయలు పండించే వారికి అమ్మి ఆదాయం సమకూర్చుకుంటున్నారు. కూరగాయల వ్యర్థాలు, మిగిలిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో కాని, డబ్బాలో వేసుకోవాలి. వాటికి అడుగున ఒక రంధ్రం చేయాలి. దీని ద్వారా చెత్తలోని తేమ బయటకు పోతుంది. ఇలా రోజూ ఇంట్లో మిగిలిన తడి చెత్తను ఆ కుండ/డబ్బాలో వేసుకోవాలి. వాటి చుట్టూ కారం, పసుపు చల్లాలి. దీనివల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. ఒక నెల రోజులోనే కంపోస్ట్‌ తయారవుతుంది. ఇలా సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను చాలామంది వినియోగించుకుంటున్నారు.

సొంతంగా మొక్కలు పెంచేలా..



సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని ఇంటి పెరట్లో మొక్కలకు వాడడంతో మంచి దిగుబడి వస్తుంది. ప్రస్తుం కూరగాయలు అధిక ధరలు ఉంటున్నాయి. ఇంట్లో పెంచుకున్న కూరగాయల వల్ల సొమ్ము ఆదా అవుతుంది. మహిళలు పెద్ద శ్రమ లేకుండా ఎరువులను ఇంటి ఆవరణలోనే తయారు చేసుకోవచ్చు. దీనికిగాను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

– శ్రీనివాస్‌, శానిటరీ సూపర్‌వైజర్‌, నగరపాలక సంస్థ



ఇంట్లో వ్యర్థాలతో తయారు చేసిన సేంద్రియ ఎరువు

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

సీతానగరం: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఏవీకే చైతన్య తెలిపారు. బుధవారం సీతానగరం స్త్రీశక్తి భవనంలో వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు జరిపించడంతో వారు వెంటనే గర్భం ధరించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిపై కిశోర బాలికలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 12 జరిగే నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు మాత్రలు మింగించాలని చైతన్య తెలిపారు. ఐసీడీఎస్‌ అసిస్టెంట్‌ సీడీపీఓ పి.వరలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్‌ రాయుడు, పీహెచ్‌ఎన్‌ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్‌ సుధాకర్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ పెదలక్ష్మి, జి.ఇందిరా భారతి తదితరులు పాల్గొన్నారు

నూతన ఆవిష్కరణలు చేయాలి



మాట్లాడుతున్న కాగ్నిజెంట్‌ డైరెక్టర్‌ పునీత్‌ పాండే

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్‌ యూనివర్సిటీలో బహుళజాతి సంస్థ కాగ్నిజెంట్‌ ఆధ్వర్యంలో బీటెక్‌ ఫైనలియర్‌ విద్యార్థులతో ప్రీ–ప్లేస్మెంట్‌ టాక్‌ బుధవారం జరిగింది. కాగ్నిజెంట్‌ డైరెక్టర్‌ పునీత్‌ పాండే రిసోర్స్‌ పర్సన్‌గా వ్యవహరించారు. యువ ఇంజినీర్లు నిత్యం నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. హెచ్‌ఆర్‌ మేనేజర్‌ ప్రవీణ్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎంవీఎస్‌ బాబు, ప్లేస్‌మెంట్‌ అధికారి డాక్టర్‌ కె.వల్లీమాధవి, డీన్‌ డాక్టర్‌ ఎస్‌.లీలావతి, డైరెక్టర్‌ మురళీధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు రేపు అంతరాయం

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్‌ రాజమహేంద్రవరం రూరల్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ నటరాజన్‌ గురువారం తెలిపారు. ఆ రోజు 11 కేవీ వడిశలేరు టౌన్‌, రూరల్‌ ఫీడర్లు, 11 కేవీ ఎస్టీరాజాపురం ఫీడర్లలో చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. వడిశలేరు, ముకుందవరం, ఎస్టీరాజాపురం గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ఈలకొలను సబ్‌ స్టేషన్‌ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ ఈలకొలను, ఏజీఎల్‌, అచ్యుతాపురం గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు. అదేవిధంగా దొంతమూరు విద్యుత్తు సబ్‌ స్టేషన్‌ పరిధిలో దొంతమూరు, వీరంపాలెం, బాలవరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



సాగులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదపూడి: సాగులో సస్యరక్షణ చర్యలతో అధిగ దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ మండల అధికారి ఎస్‌.సత్యప్రసాద్‌ అన్నారు. జి.మామిడాడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వరి పొలాలు, వాణిజ్య పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులను విచక్షణ రహితంగా వాడరాదన్నారు. రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా సాగులో మెళకువలు నేర్చుకుని, నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

పింఛన్ల మంజూరు

బిక్కవోలు: మండలంలోని 194 స్పౌస్‌ పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేంద్ర ప్రసాద్‌ తెలిపారు. ఆరికరేవుల 5, బలభద్రపురం 30, బిక్కవోలు 33, ఇలపల్లి 5, కాపవరం 10, కొమరిపాలెం 18, కొంకుదురు 22, మెళ్లూరు 5, పందలపాక 22, రంగాపురం 12, తొస్సిపూడి 6, ఊలపల్లి 26 మందికి మంజూరైందన్నారు.

మౌలిక సదుపాయాల సమస్య లేదు

రాజానగరం: ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్న మల్లంపూడి సాయి మాధవి ఇంజినీరింగ్‌ కళాశాల భవనాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను సమగ్ర శిక్ష, జిల్లా అడిషనల్‌ కోఆర్డినేటర్‌ ఎస్‌.సుభాషిణి ఖండించారు. ఉమ్మడి జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలకు చెందిన కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌ లాగ్వేంజ్‌ బోధనపై ఆరు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో కేంద్రంలో నీరు, విద్యుత్‌ సమస్యలతోపాటు సరైన మౌలిక సదుపాయాలు లేవంటూ శిక్షణ పొందుతున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగిన సంగతి విదితమే. ఈ సంఘటనపై బుధవారం ఉదయమే కేంద్రాన్ని సందర్శించిన ఆమె అక్కడ ఉన్న మౌలిక సదుపాయాల గురించి మీడియాకు వివరించారు. కరెంటు సమస్య కారణంగా ఎదురవుతున్న నీటి సమస్యను కూడా పరిష్కరించే దిశగా జనరేటర్‌ సదుపాయం కల్పించామన్నారు.